TELTEL/2023/88710
# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
www.telanganamuchatlu.in
వరంగల్ సంపుటి : 3 సంచిక : 242 శుక్రవారం 30 - 1 - 2026 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in






## అశ్రునయనాల మధ్య
# అజిత్ అంత్యక్రియలు

- ప్రభుత్వ లాంఛనాలతో దివంగత నేతకు వీడ్కోలు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి

తెలంగాణ ముచ్చట్లు

ముంబై, జనవరి 29 : అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు.. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన

2 లో



## దేశ అభివృద్ధి లక్ష్యంగా
# నిర్ణయాలు

- ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య

తెలంగాణ ముచ్చట్లు

న్యూఢిల్లీ, జనవరి 29 : పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు



అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉ

2 లో




2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# మరో కీలక పరిణామం

- బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు సిట్ నోటీసులు
- నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి

## కెసిఆర్‌కు నోటీసులపై
# మండిపడ్డ బిఆర్ఎస్

- కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్టగా విమర్శలు
- రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం
- మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్,జనవరి 29 :బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడంపై ఆ పార్టీ వర్గాలు మండిపడ్డాయి. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే



అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు


2 లో

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సిరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్

తెలంగాణ ముచ్చట్లు

న్యూఢిల్లీ,జనవరి 29 : తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో



మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగు పరచడానికికాల యాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణా లు, అవినీతి, మంత్రుల మధ్య

2 లో

# కెసిఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య




- ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్,జనవరి 29 : విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను

2 లో



## అంతరాయం లేకుండా
# రాష్ట్రంతో విద్యుత్ సరఫరా

- రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి
- పునరుత్పాదక ఇంధన రంగాల పనులు వేగవంతం చేయాలి
- అధికారులతో సమీక్షలో సిఎస్ రామకృష్ణారావు సూచన

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్,జనవరి 29 : రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ , ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర

2 లో

# ఇప్పటికే కు 80 లక్షల మంది దర్శనం

- రాత్రికి కోటికి మించే అవకాశం
- శాశ్వత అభివృద్ధికోసం మరో 41 ఎకరాల భూసేకరణ
- శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మౌళిక సదుపాయాలు
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్కల వెల్లడి



తెలంగాణ ముచ్చట్లు

మేడారం,జనవరి 29 : మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు

2 లో

# మేడారం జాతర గిరిజనుల మహాకుంభమేళా



- దేశంలనే అతి పెద్ద గిరజనుల పండగ
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు

తెలంగాణ ముచ్చట్లు

మేడారం,జనవరి 29 : మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద

2 లో

# గుండెపోటుతో సినీ సంగీత దర్శకుడు నల్లూరి మృతి

## సుధీర్ మృతికి పలువురు ప్రముఖుల సంతాపం

తెలంగాణ ముచ్చట్లు

హైదరాబాద్,జనవరి 29 : ప్రముఖ టీవీ, సినీ సంగీత దర్శకుడు నల్లూరి సుధీర్ కుమార్ గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. టీవీ ధారావాహికలకు సంగీతం అందించిన సుధీర్ కుమార్ పలు నంది అవార్డులను అందుకున్నారు. రెండున్నర దశాబ్దాలపాటు టీవీ, రేడియో

2 లో



# అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి

ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఎపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మరణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి నుంచి... కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# అంతరాయం లేకుండా రాష్ట్రంతో విద్యుత్ సరఫరా

మొదటిపేజీ తరువాయి

అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సి.ఎస్ కు వివరించారు. ఇ-గవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదించిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్ నగర్, పరిగి లో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఃూష్ట్రంలో వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్‌ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సి.ఎస్, లక్ష్యాల సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మాతా?శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగులకు సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జి.హెచ్.యం.సి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీఈ / సీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీలలో ట్గి÷బైర్ విస్తరణ పై సమీక్ష చేశారు.

రాష్టాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే దిశగా చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఐటీ సేవలను ప్రజలకు సులబతరంగా అందించేందుకు ఒక చిత జీబిబం÷ఔ రూపొందించాలని, మీసేవ కేంద్రాలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆధికారులకు సూచించారు. రాష్ట్రంలో వీలైనంత మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ట్గ్-÷బైర్ విస్తరణకు తగు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా పై సాండ్ రీచ్ లలో ఏర్పాటు చేసిన సి.సి.టివీల ఏర్పాటు, ఇటీవల కాలంలో చేపట్టిన సంస్కరణలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. భారత ఫ్యూచర్ సిటీ, టిజి ఐఐసి చేపట్టిన పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగాలలో చేపట్టిన ప్రాజెక్టలపై సి.ఎస్ సమీక్షించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్పిడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యం.డి. ఆశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇప్పటికే కు 80 లక్షల మంది దర్శనం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు.

ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. క్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప?లక్నవరం?జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు.

# అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

## - టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి

## - కేంద్రాన్ని హెచ్చరించిన ఆర్థిక సర్వే

న్యూఢిల్లీ, జనవరి 29 : వస్తువులు, సేవల విషయంలో అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐ, ట్రేడ్ కంట్రోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. లేదంటే అమెరికా, చైనా దేశాల మధ్య భారత్ క్రాస్ ఫైర్ అవ్వక తప్పదని తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2026 - 27 సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 'ది ఎకనామిక్ సర్వే 2025 - 26' భారత్‌ను హెచ్చరించింది. అమెరికా, చైనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఎకనామిక్ సర్వే ప్రకారం.. ప్రపంచ రాజకీయాల్లో చైనా, అమెరికా దేశాల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. చైనాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని అమెరికా.. అమెరికాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని చైనా పావులు కదుపుతున్నాయి. అమెరికా ఆధిపత్యం సాగిస్తున్న రంగాలపై చైనా దృష్టి సారించింది. అమెరికా కూడా అదే పని చేస్తోంది. ఒకే విధమైన ఆలోచనలు ఉన్న దేశాలను కలుపుకొని సెక్యూర్ ఏఐ ఎకోసిస్టమ్‌ను తయారు చేయాలని అమెరికా చూస్తోంది. సాధారణంగా అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ ఏపీఐలు, సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో ఆధిపత్యం కొనసాగిస్తున్న దేశాలే ప్రపంచ రాజకీయాల్లో పవర్‌ను కలిగి ఉంటాయి. భారత్ ఈ రెండు దేశాలపై ఆధారపడటం తగ్గించాలి. వస్తువులు లేదా సేవల విషయంలో ప్రత్యామ్నాయం లేని దేశంగా తప్పకుండా ఎదగాల్సిన అవసరం ఏంతైనా ఉంది. అలా చేయకపోతే ప్రపంచ రాజకీయాల్లో భారత్ పట్టు కోల్పోతుంది. అమెరికా, చైనాల మధ్య జరిగే గొడవల వల్ల భారత్ ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. చైనా గనుక దిగుమతులపై ఆంక్షలు విధించినా లేదా ధరల్ని పెంచినా దాని ప్రభావం భారత తయారీ రంగంపై తీవ్రంగా ఉంటుంది. అలాగే అమెరికా.. పాలసీలను కఠినతరం చేస్తే దాని ప్రభావం భారత సర్వీస్ సెక్టార్‌పై తీవ్రంగా ఉంటుంది.

# గుండెపోటుతో సినీ సంగీత దర్శకుడు నల్లూరి మృతి

మొదటిపేజీ తరువాయి

రంగాలలో, చిత్రసీమలోనూ సంగీత దర్శకుడిగా రాణించిన నల్లూరి సుధీర్ కుమార్ హైదరాబాద్ దూరదర్శన్ తొలినాళ్ళలో వందలాది పాటలను స్వరపరిచారు. టీవీ ధారావాహికలకు, స్పెషల్ ఎపిసోడ్స్ కు సంగీతం అందించిన ఆయన ఎన్నో నంది అవార్డులను అందుకున్నారు. పలు చిత్రాలకూ ఆయన సంగీతం అందించారు. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'అగ్ని ప్రవేశం'కు ఆయనే సంగీత దర్శకుడు. అలానే తమ్మారెడ్డి భరద్వాజ రూపొందించిన 'కూతురు', 'అమ్మో అల్లుడా' తదితర చిత్రాలకు సంగీతం అందించారు.

# చైన్ స్నాచింగ్‌లపై అవాస్తవ ప్రచారాలు

మొదటిపేజీ తరువాయి

మీడియాలో వచ్చే ధ్రువీకరించని వార్తలను, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయకండి. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితం. శాంతిభద్రతల పరిరక్షణలో మాకు సహకరించండి. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయండి. నిశ్చింతగా ఉండండి. మీ భద్రతే మా బాధ్యతని పేర్కొన్నారు.

# మేడారం జాతర గిరిజనుల మహాకుంభమేళా

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క-సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంబించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# మున్సిపల్ ఫిర్యాదులపై ఇసి యాప్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు.

# కెసిఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.'చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

హైదరాబాద్, జనవరి 29 : ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే.ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్ నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళు ్లగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపిం గ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

మొదటిపేజీ తరువాయి

ంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ఃూష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్-ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నాను.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# సమ్మక్క--సారలక్క జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు



ఎల్కతుర్తి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామం, బీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామాల్లో జరుగుతున్న సమ్మక్క--సారలక్క మహా జాతరకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహించే ఈ మహా జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్ ఆదేశాల మేరకు ఎస్సై రాజు, ఎస్సై దివ్య, వేలేరు ఎస్సై సురేష్ నాయక్, ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్‌లతో పాటు ఇతర సిబ్బంది సమన్వయంతో జాతర ప్రాంతంలో పోలీస్ బందోబస్తును కఠినంగా అమలు చేస్తున్నారు. సీఐ పులి రమేష్ స్వయంగా పర్యవేక్షణ చేస్తూ భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. జాతర జరుగుతున్న ఈ నెల 28, 29, 30 తేదీల్లో భద్రతా చర్యలను మరింత కఠినంగా అమలు చేస్తామని పోలీసులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేష్ మాట్లాడుతూ, జాతర సందర్భంగా భక్తులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. సమ్మక్క--సారలక్క గద్దెల వరకు చేరుకునేంతవరకు శాంతి భద్రతలు పాటిస్తూ పోలీసుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని ఆయన సూచించారు.

# నాచారంలో ఐరిస్ ఫ్లోరెట్స్ ప్లే స్కూల్ ప్రారంభం

## - సాయి నగర్ కాలనీలో ఆధునిక సదుపాయాలతో నూతన విద్యా సంస్థ







నాచారం, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరిస్ ఫ్లోరెట్స్ ప్లే స్కూల్‌ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐరిస్ ఫ్లోరెట్స్ సీఎండీ శిరీష్ తూర్లపాటి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, నాచారం పరిధిలో ఇప్పటివరకు ఉన్న ప్లే స్కూల్స్‌లో ఐరిస్ ఫ్లోరెట్స్ ప్లే స్కూల్ అత్యంత ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారుల సర్వాంగీణ అభివృద్ధికి అవసరమైన విద్య, భద్రత, ఆటపాటలకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక బోధనా విధానాలతో ఈ స్కూల్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలిపారు. చిన్న పిల్లల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని సురక్షిత వాతావరణంలో విద్యను అందించేలా స్కూల్‌ను రూపొందించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్లే స్కూల్ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్లే స్కూల్ నిర్వాహకులు నాగేష్, శిరీష్‌లను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లే స్కూల్ సిబ్బంది రవికాంత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వశక్తితో ఎదగాలి లయన్ చంద్రమోహన్ నరేసేపల్లి






నాచారం, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలంటే నైపుణ్యాభివృద్ధి కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షుడు లయన్ చంద్రమోహన్ నరేసేపల్లి అన్నారు. నాచారంలోని వీర సావర్కర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, వీర సావర్కర్ నగర్ కాలనీ అసోసియేషన్ సహకారంతో మహిళలకు మూడు నెలలపాటు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు 50 శాతం సబ్సిడీతో 26 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అలాగే లయన్స్ క్లబ్ నాచారం సాకారంతో మరో 6 కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మహిళలు స్వశక్తితో నిలబడితే కుటుంబ ఆర్థికాభివృద్ధికి బలంగా మారతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ ప్రకాష్, ప్రాజెక్ట్ కో--చైర్మెన్ ప్రవీణ్ కుమార్, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ కోశాధికారి లయన్ విజేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ నాచారం సభ్యుడు నందికొండ శ్రీనివాస్ రెడ్డి, వీర సావర్కర్ నగర్ అధ్యక్షుడు వేంకట రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్‌తో పాటు లయన్స్ క్లబ్ నాచారం సభ్యులు పాల్గొన్నారు.





# ఘట్‌కేసర్ సర్కిల్‌లో పారిశుధ్య కేంద్రాల తనిఖీ

## - డోర్ టు డోర్ చెత్త సేకరణ తప్పనిసరి : గ్రేటర్ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): గ్రేటర్ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్ ,ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వాణి రెడ్డి ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ప్రాథమిక డంపింగ్ యార్డ్‌ల సేకరణ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక చెత్త సేకరణ కేంద్రాల పనితీరును పరిశీలించి, ద్వితీయ సేకరణ (సెకండరీ పాయింట్లు) వ్యవస్థపై సంబంధిత అధికారులతో విస్తృతంగా చర్చించారు. డోర్ టు డోర్ విధానంలో స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణను తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎక్కడా కూడా జీవీపీ (గ్యార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు) ఉండకుండా పూర్తిగా తొలగించాలని స్పష్టమైన సూచనలు చేశారు. అలాగే ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఏబీసీ (జంతు జనన నియంత్రణ కేంద్రం)ను కూడా ఆయన సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా పునర్వినియోగం చేస్తూ సేవల నాణ్యతను మెరుగుపర్చాలని సూచించారు. నగర పారిశుధ్య ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ప్రతి స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, స్వచ్ఛత కార్యక్రమాలను బలోపేతం చేయాలని అదనపు కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి తెలిపారు.

# డబ్బులకోసం కాదు అభివృద్ధి కోసం ఓటు వేయండి ఈటల రాజేందర్

## - అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీ లో పాల్గొని బిఆర్ఎస్ కేసీఆర్ పాలనపై తీవ్ర విమర్శలు





మేడ్చల్ మల్కాజ్గిరిజిల్లా,జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీ లో పాల్గొన్నారు. ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, "డబ్బులు మద్యం మాత్రమే నమ్మితే మాలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండలేరు. నన్ను కోసినా రూపాయి లేదు అని ముఖ్యమంత్రి చెబుతున్నప్పుడు, అభివృద్ధి సాధ్యం కాదు"అని వ్యాఖ్యానించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో పెన్షన్లు పెంచకపోవడం, కొత్త పెన్షన్లుఇవ్వకపోవడం, నిరుద్యోగ భృతి కేటాయించకపోవడం వంటి సమస్యలనుగమనించి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ, కేంద్రం ద్వారా వచ్చే నిధులు లేకపోవడం వల్ల అభివృద్ధి జరగడం లేదని చెప్పారు. ఈటల, "భారత ప్రభుత్వ నిధుల ద్వారా హైదరాబాదు లో ఫ్లైఓవర్‌లు, రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటి పనులు సాధ్యమయ్యాయి. మేము డబ్బులతో ప్రజల ఆత్మ గౌరవాన్ని కొనుకోము" అన్నారు. రేలీ లో ఆయన కేసీఆర్, రేవంత్ రెడ్డి పాలనను ఘాతుకరంగా విమర్శిస్తూ, పేదలకు ఇచ్చిన భూభూములను అడ్డుకోవడం, పేదఇళ్లను కూల్చడం వంటి ఘటనలపై దృష్టి సారించారు. అంతేకాకుండా ఈటల రాజేందర్, మున్సిపాలిటీ అభివృద్ధికి బాధ్యత మాకు అప్పగిస్తే, ప్రజల కోసం గర్వంగా పనులు చేస్తామని హామీ ఇచ్చారు. చివరగా, ఆయన ప్రజలకు "కమలం పువ్వు గుర్తుతో ఓటు వేయండి, మమ్మల్ని ఆశీర్వదించండి" అని పిలుపునిచ్చారు.

# పారిశుధ్య కార్మికులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

## - జిహెచ్ఎంసి -- కర్కినోస్ -- ఒరాకిల్ సంయుక్త ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు





మల్కాజిగిరి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు):జిహెచ్ఎంసి మరియు కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ, ఒరాకిల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిహెచ్ఎంసి సర్కిల్ మల్కాజిగిరి, మౌలాలి, అల్వాల్ సర్కిళ్లకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ మరియు ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత హెల్త్ క్యాంపును మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఈ హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాంపులో ఏవైనా పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లయితే, కర్కినోస్ ఇండియన్ క్యాన్సర్ సొసైటీ మరియు ఒరాకిల్ సంస్థలు పూర్తి స్థాయిలో నయం అయ్యేంతవరకు ఉచిత వైద్య సేవలు అందిస్తాయని స్పష్టం చేశారు. కార్మికులు మద్యం, పొగాకు, సిగరెట్లు, గుట్కా, తంబాకు వంటి దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో విధులు నిర్వహించే కార్మికులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఎక్కువ శాతం కార్మికులు పేదరిక నేపథ్యం నుండి వచ్చినవారైనందున, అనారోగ్యానికి గురైతే కుటుంబాలు మరింత ఆర్థికంగా వెనుకబడే ప్రమాదం ఉందని తెలిపారు. అందుకే వైద్య పరీక్షలకు భయపడకుండా, ముఖ్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ముందుగానే చేయించుకోవాలని, తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మజ, ముఖ్య ఆరోగ్య అధికారి, జిహెచ్ఎంసి మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోని కార్మికులందరికీ దశలవారీగా బ్రెస్ట్ క్యాన్సర్ మరియు ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి చివరి వారంలో మరోసారి సమగ్ర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్, ముఖ్య వైద్యాధికారి పద్మజ, డాక్టర్ కే. మంజుల, మౌలాలి డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, సానిటరీ సూపర్వైజర్ చింత శ్రీనివాస్, ఏఈ కిరణ్ పవర్, శానిటరీ జవాన్ భాస్కరరావు, గోవిందమ్మ, వెంకటేష్ గిరి, ఎస్ఎఫ్ఏ సిబ్బంది, మల్కాజిగిరి--మౌలాలి సర్కిళ్లకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు, కర్కినోస్ హెల్త్ కేర్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

## - దమ్మపేట మండల బీఆర్ఎస్ సర్పంచ్‌ల వినతి





అశ్వారావుపేట, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): దమ్మపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లు కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ నాయకుడు సోయం వీరభద్రం, దమ్మపేట మండల బీఆర్ఎస్ సర్పంచ్‌లతో కలిసి గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం మరియు మండల రెవెన్యూ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, నూతన ఎంఆర్వో రామ్ నరేష్ యాదవ్‌లను వారి చాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి అర్హులకు పట్టా పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని ఎంఆర్వో దృష్టికి తీసుకువెళ్లారు. నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయితీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. గ్రామాభివృద్ధికి తక్షణమే చర్యలు చేపట్టాలని, పంచాయితీరాజ్ నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం సర్పంచ్ సోయం సత్యవతి, పార్కెలగండి సర్పంచ్ కొమరం సుశీల, తాటిసుబ్బన్నగూడెం సర్పంచ్ సవలం స్వాతి, గున్నేపల్లి సర్పంచ్ తొగత్త అనిత, పెద్ద గొల్లగూడెం సర్పంచ్ యట్ల రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పథకాలే గెలుపునకు బాట!

## - ఎండి రెహానా బేగం



సత్తుపల్లి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల సభ్యుల నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎలక్షన్ అధికారుల పర్యవేక్షణలో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుండగా, పోటీ తీవ్రతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో గురువారం 22వ వార్డుకు కాంగ్రెస్ పార్టీ తరపున ఎండి కమల్ పాష సతీమణి ఎండి రెహానా బేగం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం ఆమె మాట్లాడుతూ, 22వ వార్డులో పోటీ చేసే అవకాశం కల్పించిన శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఆ పథకాలను విశ్వసించిన ప్రజలు తమకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

## - రూ.4.5 లక్షల జరిమాన విధింపు

సత్తుపల్లి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి కోర్టు: చెల్లని చెక్కు (చెక్ బౌన్స్) కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.4.5 లక్షల జరిమాన విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ బి.ఎస్.ఎన్. సుమబాల గురువారం తీర్పు వెలువరించారు. కల్లూరు మండలానికి చెందిన సిద్ధంశెట్టి మధుసూదన రావు, అదే మండలంలోని రంగం బంజర్ గ్రామానికి చెందిన పంచకర్ల శ్రీనివాసరావుకు 2013 నవంబర్ 13న ప్రామిసరీ నోట్ హామీగా రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చారు. ఈ అప్పులో భాగంగా పార్ట్ పేమెంట్ పేరుతో పంచకర్ల శ్రీనివాసరావు 2014 డిసెంబర్ 15న రూ.3 లక్షల విలువైన చెక్కును సిద్ధంశెట్టి మధుసూదన రావుకు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో క్లైమ్ చేయగా అది బౌన్స్ కావడంతో, బాధితుడు సీనియర్ న్యాయవాదులు పిన్నం జానకి రామారావు, మాయర రమేష్‌ల ద్వారా సత్తుపల్లి కోర్టులో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడు పంచకర్ల శ్రీనివాసరావుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.4.5 లక్షల జరిమాన విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. జరిమాన చెల్లించని పక్షంలో మరో నెల అదనపు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని మేజిస్ట్రేట్ ఆదేశించారు. ఈ కేసులో విజయం సాధించిన న్యాయవాదులను పలువురు బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

# కేశవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం

## - నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి





మేడ్చల్--మల్కాజిగిరి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు):మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు.కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# మున్సిపల్ ఎన్నికలపై ఈటల రాజేందర్ సుదీర్ఘ కసరత్తు

## - ఎనిమిది గంటల సమీక్ష - మూడు మున్సిపాలిటీలపై కాషాయ జెండా ఖాయం





మేడ్చల్ మల్కాజ్గిరి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ సుదీర్ఘంగా కసరత్తు నిర్వహించారు. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన సమీక్ష సమావేశంలో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు జరగనున్న అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ మూడు మున్సిపాలిటీలలో కౌన్సిలర్ల ఎంపిక, గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులతో ఈటల రాజేందర్ విస్తృతంగా చర్చలు జరిపారు. ప్రజల్లో పట్టు ఉన్న, పార్టీని గెలిపించే అభ్యర్థులనే బరిలోకి దింపాలని సూచించారు.ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారని, దేశంలో అభివృద్ధి మోదీ నాయకత్వంలోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగిపోయారని, భూ కబ్జాలు, పేదల ఇళ్ల కూల్చివేతలు, రౌడీయిజం పెరిగిపోయాయని తీవ్ర విమర్శలు చేశారు. భూ మాఫియాకు కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అమాయక ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు.అక్కడా ఇక్కడా లేని బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలకు ఇప్పటికే అర్థమైందని, ప్రస్తుతం ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకులే ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీలపై కాషాయ జెండానే ఎగురుతుందని ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు.

# స్వర్గీయ మన్నే సుబ్రమణ్యం 57వ జయంతి వేడుకలు





కుషాయిగూడ, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ లో యం పవర్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు, మంచికి మారుపేరు, అందరివాడు అయిన స్వర్గీయ మన్నే సుబ్రమణ్యం 57వ జయంతిని కుషాయిగూడ ఇండస్ట్రియల్ కాంటీన్ వద్ద మన్నే మిత్ర బృందం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా స్వర్గీయ మన్నే సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన జీవితకాలంలో పరిశ్రమల అభివృద్ధితో పాటు సమాజ సేవకు చేసిన కృషిని వక్తలు స్మరించుకున్నారు. ముఖ్యంగా కార్మికుల సంక్షేమం, అవసరమైన వారికి సహాయం చేయడంలో ఆయన చూపిన మానవత్వం, సరళ స్వభావం అందరికీ ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.మంచికి మారుపేరుగా గుర్తింపు పొందిన మన్నే సుబ్రమణ్యం ఎప్పుడూ అందరితో కలిసిమెలసి ఉండేవారని, సమస్యలో ఉన్న వారికి అండగా నిలిచే గుణం ఆయనను “అందరివాడు”గా నిలిపిందని పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, విలువలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ జయంతి కార్యక్రమంలో మన్నే నాగ ఫణీంద్ర, మన్నే ప్రగతి, మన్నే నాగమల్లేశ్వరి, కొత్త రామారావు, గడ్డ మీది రాములు యాదవ్, నీరు కొండ సతీష్ బాబు, రామ్ ప్రదీప్, శివానంద్, గొట్టిపాటి వెంకటేశ్వరావు, సింగం రాజు కె . సురేష్ సాగర్ , శివ కుమార్ తదితరులు పాల్గొని స్వర్గీయ మన్నే సుబ్రమణ్యం సేవలను స్మరిస్తూ నివాళులు అర్పించారు.

# సుదర్శన్ దశదిన కర్మలో పాల్గొన్న మంత్రి కొండ సురేఖ, పరమేశ్వర రెడ్డి



ఉప్పల్, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు):ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్ కాలనీకి చెందిన సుదర్శన్ ఇటీవల మరణించగా, ఆయన దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడవి, పర్యావరణ, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖతో కలిసి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుదర్శన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# కందుకూరు హైవే పై ఆటో బోల్తా

కందుకూరు,తెలంగాణ ముచ్చట్లు : జనవరి 29 : కందుకూరు హైవే 167 బి పై ఆనందపురం అడ్డరోడ్డు వద్ద ఆటో బోల్తా కొట్టింది. ప్రయాణికులు ఒంగోలు నుండి, మాచవరం గ్రామానికి బయలుదేరినట్లు తెలియజేశారు. ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించబోయి అదుపుతప్పి ఆనందపురం అడ్డ రోడ్డు వద్ద బోల్తా పడింది. గాయపడిన వారిని కందుకూరు ఏరియా హాస్పిటల్ కుతరలించారు..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలి

## ఎంపీ ఈటల రాజేందర్



మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులకు శాలువాలు కప్పి, వీర తిలకం దిద్ది ఆశీర్వదించారు.సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు అన్ని పార్టీల పాలనను ప్రజలు చూశారని, ఈసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత దేశంలో శాంతి భద్రతలు మెరుగయ్యాయని, అభివృద్ధిపై ప్రజల్లో చర్చ జరుగుతోందని తెలిపారు. ప్రజలు తింటున్న బియ్యం నుంచి పట్టణాభివృద్ధి వరకు కేంద్ర ప్రభుత్వ సహకారమే ప్రధానమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వేల కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ల నిర్మాణం కేంద్ర ప్రభుత్వమే చేపడుతోందని, తాను ఎంపీ అయిన తర్వాత మల్కాజిగిరిలో రైల్వే బ్రిడ్జీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. పట్టణాల్లో రోడ్లు, మురుగు కాలువలు, అంగన్వాడీ కేంద్రాలు, స్మశాన వాటికలు, తడి--పొడి చెత్త షెడ్లు, రైతు వేదికలు అన్నీ కేంద్ర నిధులతోనే నిర్మితమయ్యాయని చెప్పారు.కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించిన ఆయన, హామీలు ఇచ్చి అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి, పెన్షన్ పెంపు వంటి హామీలు అమలుకాలేదని ఆరోపించారు.రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదని, సఫాయి కార్మికులకు జీతాలు చెల్లించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వమే ముందుకు వస్తోందని అన్నారు. పేదల హక్కుల కోసం తాను నిరంతరం పోరాడుతున్నానని, తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలిచానని ఈటల రాజేందర్ చెప్పారు. గౌరవంగా జీవించాలన్నా, దోపిడీ లేని పాలన కావాలన్నా భారతీయ జనతా పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎల్లంపేట మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయాలని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నందా రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జీలు మంత్రి కృష్ణ యాదవ్, వికే మహేష్, సామ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

## - లారీ ఢీకొని వ్యాపారి మృతి



సత్తుపల్లి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి పట్టణంలోని బోస్ బొమ్మ సెంటర్ వద్ద గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన పొదిలి నారాయణరావు (59) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వ్యాపారం నిమిత్తం సత్తుపల్లి పట్టణానికి వచ్చిన నారాయణరావు ప్రమాదానికి గురయ్యారు. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం, వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఆయన అదుపుతప్పి కింద పడిపోయి, లారీ టైరు కింద నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద తీవ్రతతో సంఘటన స్థలంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు నారాయణరావు ఫ్యాన్సీ వస్తువుల వ్యాపారం చేస్తూ స్థానిక మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయించేవారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.


# అమ్మవారిపేటలో గద్దెనెక్కిన సమ్మక్క

## - డప్పు చప్పులతో సమ్మక్క ను గద్దె పైకితీసుకు వచ్చిన బైరి శెట్టిశ్యాంసుందర్

## - తొమ్మిది రౌండ్లు గాలిలో కాల్పులు జరిపిన డీసీపీ దార కవిత







కాజీపేట్ జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు) కాజీపేట్ మండలంలోని అమ్మవారిపేట లోగల మినీ మేడారం జాతరగా పేరుగాంచిన సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా కొనసాగుతుంది. ఉర్సు కరీమాబాద్ కి చెందిన బైరి శెట్టి శ్యామ్ సుందర్ అమ్మవారిపేట లో ఉన్న దామెర గుట్ట వద్ద నుంచి సమ్మక్కకు ప్రత్యేక పూజలు నిర్వహించి లంకను తీసుకోని బైరి ఈశ్వరయ ముందు వెనక పెద్ద వడ్డే సమ్మక్క ను డప్పుచప్పుళ్ళ మధ్య అంగరంగ వైభవంగా అమ్మవారినీ గద్ద పైకి వస్తున్న క్రమంలో దారిలో భక్తులు ఎదురు కోళ్లు ఇస్తూ శివశక్తి పూనకాలతో అమ్మవారినిగద్దె పైకి తీసుకు వచ్చారు. సమ్మక్కను గద్దె పైకి తీసుకువచ్చే ముందు సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత ఒకే 47 గన్ తో 9 రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్కను ఘనంగా స్వాగతం పలికారు. పోలీస్ బందోబస్తు మధ్య ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా మడికొండ సీఐ పుల్యాల కిషన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుదీర్ఘ ప్రాంతాల నుంచి భక్తులు ఎడ్లబండ్లపై జాతరకు వచ్చి అమ్మవారి గద్దెల చుట్టూ ఎడ్ల బండ్లతిప్పుతూ మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట సిఐ వై. సుధాకర్ రెడ్డి ఎమ్మార్వో సిహెచ్ రాజు, ఆర్ ఐ కృష్ణ జాతర చైర్మన్ కోడూరు బిక్షపతి, జాతర ఆర్గనైజర్ దాసి రామ్ దేవ్, కోశాధికారి బైరి నాగరాజు, బైరి హరి ,నక్క కొమురయ్య యాదవ్, చింత ప్రకాష్, జలగం రంజిత్, అవునూరి కుమారస్వామి , ఆవు నూరి రవి,మరుపల రవి, బత్తిని వసుంధర, మంథని సునీత, పోసాల స్వామి, ఆవు నూరి బిక్షపతి, పూస సుభద్ర, పూజారులు బైరశెట్టి శ్యాంసుందర్, బైరి ఈశ్వరయ్య నామ ని శివమూర్తి, బైరి కిరణ్ తదితరులు దేవతలను తీసుకురావడం జరిగింది.

# కొమ్ముగూడెంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం.!

## - తలసేమియా, టీబీ బాధిత రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం.

## - గ్రామ యువత సేవలకు భరోసాగా నిలిచిన బీఆర్ఎస్ నాయకుడు సోయం వీరభద్రం





అశ్వారావుపేట, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో గ్రామ యువత మానవత్వాన్ని చాటుతూ ఆదర్శంగా నిలిచింది. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రెండు నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు గ్రామ యువత, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన వుకే ఉదయ్‌కిరణ్ తలసేమియా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న గ్రామ యువత, సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో బాధిత కుటుంబానికి రూ.10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల చెంతకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో కలిసి వెళ్లి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకుడు సోయం వీరభద్రం ప్రత్యేకంగా పాల్గొని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కోటా కృష్ణవేణి అనారోగ్యంతో భర్తను కోల్పోగా, ఆమె కుమారుడు అనిల్ టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. వారి దయనీయ పరిస్థితిని గమనించిన గ్రామ యువత, గ్రామస్థులు కలిసి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు, మందుల నిమిత్తం రూ.3,500/- ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయ కార్యక్రమంలో కొమ్ముగూడెం సర్పంచ్ సోయం సత్యవతి, ఉప సర్పంచ్ బుద్దుల శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సోయం వీరభద్రం మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ అనే భావనతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి పేద కుటుంబాలను ఆదుకున్న కొమ్ముగూడెం గ్రామ యువత సేవలు అభినందనీయమని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వుకే నరసింహారావు, సోయం వెంకన్నబాబు, సత్యనారాయణ, కీసరి మల్లికార్జునరావు, జోనుబోయిన సుబ్బారావు, పద్దం విజయలక్ష్మి తదితర గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12జరిగే సమ్మెను జయప్రదం చేయండి

## తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్,వర్కర్స్ యూనియన్



జోగులాంబ,జనవరి29(తెలంగాణ ముచ్చట్లు): గురువారం రాజోలి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వచ్చేనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నోటీసు రాజోలి ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది మరియు కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ పంచాయితీ సిబ్బందికి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికుల్లో ఒకరు చనిపోతే వారి కుటుంబ సభ్యులతో ఉద్యోగం ఇవ్వాలని. వీరు ఎవరైనా చనిపోతే దాన సంస్కారాలకు పదివేల నుంచి 20వేల రూపాయలు ఇవ్వాలని అలాగే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఇళ్ల స్థలం కూడా కేటాయించాలని కార్మికులకు అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్ అయిదు లక్షలు ఇవ్వాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ సమ్మెలో ప్రతి కార్మికుడు వచ్చే నెల 12వ తేదీన పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు రమేష్ సార్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆరు విజయకుమార్ తెలంగాణ పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మన్న అధ్యక్షులు తిక్కన్న సహాయ కార్యదర్శి కృష్ణ సౌల్ రాజు మహేష్ నడిబన్న సభ్యులు దస్తగిరి నరసన్న మద్దిలేటి వరదల అశోక్ సుందరాజు రంగన్న పాల్గొన్నారు. అనంతరం సమ్మె నోటీసుని ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్గారికి ఇవ్వడం జరిగింది.

# గొట్టిపాటి కిచెన్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు, జనవరి 29 : కందుకూరు మండలం ఓగూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన గొట్టిపాటి కిచెన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఈ ఉదయం ప్రారంభించారు. కందుకూరు ప్రాంతంలో సరికొత్తగా, రెస్టారెంట్ లో ఫుడ్ సప్లై కోసం రోబోను ఏర్పాటు చేయగా, రోబో పనితీరును ఎమ్మెల్యే ఆసక్తిగా తిలకించారు. రెస్టారెంట్ ను కలర్ ఫుల్ గా తీర్చిదిద్దారని, యాజమాన్యాన్ని ఎమ్మెల్యే గారు అభినందించారు. ఫుడ్ బిజినెస్ కు మంచి డిమాండ్ ఉందని, ఆహార పదార్థాలను రుచి నాణ్యతతో అందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు ఆకాంక్షించారు. ముందుగా ఈ ప్రారంబోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి నిర్వాహకులు గొట్టిపాటి కొండయ్య ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# పకడ్బందీ ఏర్పాట్లతో మున్సిపాలిటీల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

### - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





ఖమ్మం బ్యూరో, జనవరి -29(తెలంగాణ ముచ్చట్లు) : ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం అప్రమత్తంగా ఉంటూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఖమ్మం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీ వార్డుల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, హెల్ప్ డెస్క్ లో అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికల నియమ, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు కీలక ఘట్టమని, నామినేషన్ పత్రాలలో ప్రతి అంశాలు సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నిబంధనల ప్రకారం చూడాలని తెలిపారు. జిల్లాలోని ఏదులాపురం, వైరా, కల్లూరు, మధిర, సత్తుపల్లి ఐదు మున్సిపాలిటీ లలో నామినేషన్లు దాఖలు ప్రక్రియ సజావుగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కు విధిగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు. వార్డు సభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రపోజర్ గా ఉండాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పిళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజు వారిగా నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో నమోదు చేసేందుకు అవగాహనకు హెల్ప్ డెస్క్ లో నివృత్తి చేసుకోవచ్చని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ఎంపిడీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల మీడియా కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి





ఖమ్మం బ్యూరో, జనవరి - 29(తెలంగాణ ముచ్చట్లు) : కలెక్టరేట్ మొదటి అంతస్తు, ఎఫ్-3లో గల జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా కేంద్రాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి గురువారం ప్రారంభించారు. పురపాలక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా కేంద్రం ద్వారా నిఘా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంబంధ సమాచారం మీడియా కు ఎప్పటికప్పుడు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ప్రింట్ మీడియాలో ప్రచార ఖర్చుపై నిఘా, ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రచార అనుమతులకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ కె. ప్రవల్లిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పారదర్శకంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

### - మూడో రోజు 1108 మందిగాను 370 మంది అభ్యర్థులు హాజరు

### - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ




ఎన్టీఆర్ జిల్లా, **తెలంగాణ ముచ్చట్లు :** జనవరి 29 : ఈనెల 27 నుండి ప్రారభమైన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షలను అత్యంత పారదర్శకంతో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. నగరంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షల కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పరిశీలించారు. ఇబ్రహీపట్నంలోని జాకీర్ హుసేన్ కళాశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నగరంలో ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలలో భాగంగా మూడవ రోజు నాలుగ కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. విజయవాడలోని బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, చిట్టూరి విద్యాలయం, రామవరప్పాడు జడ్పి హైస్కూల్తో పాటు ఇబ్రహీపట్నంలోని జాకీర్ హుసేన్ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మూడవ రోజు పరీక్షలకు 1108 మంది హాజరు కావల్సి ఉండగా 370 మంది అభ్యర్థులు హాజరు కావడం జరిగిందని 738 మంది అభ్యర్థులు గైరుహాజరు అయిన్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలలో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, రవాణా, పోలీస్ తదితర శాఖలు పర్యవేక్షణలలో పకడ్బంది ఏర్పాట్లతో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం ఏర్పాటు చేయడం జంరిగిందని విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబందిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.

# బీఆర్ఎస్, సీపీఎం పొత్తులో పోటీ చేసే అభ్యర్థులను ఆశీర్వదించండి

### - మాజీ ఎంపీ నామ

### - అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

### - పదేళ్ల కేసీఆర్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు అభివృద్ధి జరిగాయి





ఖమ్మం బ్యూరో, జనవరి 29(తెలంగాణ ముచ్చట్లు) : ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలోని వైరా పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, వైరా మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో గురువారం నాడు బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ, బీఆర్ఎస్,సీపీఎం పార్టీల పొత్తుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన విమర్శించారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచేందుకు 'బాకీ కార్డు'తో ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను బాకీ కార్డుతో నిలదీయాలని ప్రజలకు సూచించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో అభివృద్ధి శూన్యమని, కేసీఆర్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు సమగ్రంగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే బీఆర్ఎస్ పార్టీ విజయానికి కారణమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వైరా పట్టణం గణనీయంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో విద్యుత్ కోతలతో దుకాణాల ముందు జనరేటర్లు ఉండేవని, కేసీఆర్ పాలనలో కరెంట్ కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీటి రంగాల్లో విస్తృత అభివృద్ధి జరిగిందని నామ తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు బానోత్ చంద్రావతి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ డివిజన్ సెక్రటరీ వీరభద్రం, నియోజకవర్గ నాయకురాలు బానోత్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, వైరా రూరల్, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, వనమా వీశ్వేశ్వరరావు గారు, బీఆర్ఎస్ ఖమ్మం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీరునాయక్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, ముత్యాల వెంకట అప్పారావు, వైరా జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు షేక్ లాల్ మొహమ్మద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, మాజీ కౌన్సిలర్లు, వైరా పట్టణ, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్‌లో నెమలి అనిల్ బస్తీ బాట

### - మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి





మల్లాపూర్, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కె.ఎల్. రెడ్డి నగర్, ఓల్డ్ మల్లాపూర్, ఎస్.వి. నగర్ కాలనీ, ఎస్.వి. నగర్ కాలనీ ఫేజ్--3 ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో 'బస్తీ బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, మౌలిక వసతుల అభివృద్ధిపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సూరజ్‌తో కలిసి ప్రాంతంలోని రోడ్ల సమస్యలు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, బాక్స్ డ్రెయిన్ పనుల పురోగతి వంటి అంశాలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నెమలి అనిల్ సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద నగర్ కాలనీ అధ్యక్షులు నెమలి రవి కుమార్, కె.ఎల్. రెడ్డి నగర్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, ఫేజ్--3 పైళ్ల శ్రీనివాస్, మల్లాపూర్ జనరల్ సెక్రటరీ తాంద్ర శ్రీకాంత్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, సీనియర్ నాయకులు మక్తాల బాల్‌రాజ్ గౌడ్, దంతూరి రాజు, ఉండం శ్రీనివాస్, కోయలకొండ రాజేష్, మొయిన్ భాయ్, లక్ష్మీపతి, సురేష్ గౌడ్, మహేష్, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, మల్లాపూర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని నెమలి అనిల్ కుమార్ తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# 10వ వార్డ్ నుంచి కాంగ్రెస్ బరిలో మట్టా దేవజ్యోతి





సత్తుపల్లి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మున్సిపాలిటీలో గురువారం 10వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సోదరి అయిన మట్టా దేవజ్యోతి నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డ్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో కలిసి మట్టా దేవజ్యోతి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 10వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# మార్వాడి దౌర్జన్యాలను ఖండించాలి

**-మార్వాడి గో బ్యాక్ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి**

ఉప్పల్,జనవరి29(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రంలో మార్వాడి వ్యాపారుల దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, వాటిని ఖండించే బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిపై ఉందని మార్వాడి గో బ్యాక్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఎదుట మార్వాడి గో బ్యాక్ జేఏసీ నాయకులు తెలంగాణ శ్యామ్‌తో కలిసి ధర్నా నిర్వహించారు.రామంతపూర్ ప్రాంతంలో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి సుధీర్‌పై జిలేబి షాప్ యజమాని దాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ ఈ ధర్నా చేపట్టారు. షాప్ ముందు ఒక నిమిషం కారు నిలిపినందుకు ఆగ్రహించిన వ్యాపారి స్క్రూ డ్రైవర్‌తో వేడి చేసి కార్ టైర్‌ను కాల్చినట్టు తెలిపారు. కారులో ఉన్న కుటుంబ సభ్యులపై జిలేబి వేడి నూనె పోసి కాల్చేస్తానని బెదిరించినట్టు బాధితులు వెల్లడించారు. ఈ ఘటనపై సుధీర్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణలో మార్వాడీల ఆగడాలు మితిమీరుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా వీటిని అడ్డుకోకపోతే రానున్న రోజుల్లో రాజకీయ, వ్యాపార రంగాల్లో ఆధిపత్యం పెంచుకుని స్థానికులను అణచివేసే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు.




తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవ విలువలు మార్వాడీలకు తెలియవని, కేవలం అహంకారంతో కల్తీ వ్యాపారాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. ఈ కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సుధీర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేసిన వ్యాపారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గుర్రం కొటేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో దూకుడు పెంచిన బీఆర్ఎస్ అభ్యర్థి.!

**- కూసంపూడి మాధురి మహేష్**
**- ఇంటింటి ప్రచారంతో ఓటర్లను కలసిన అభ్యర్థి**
**- కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వినతి**





సత్తుపల్లి, జనవరి 29 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మున్సిపాలిటీ 3వ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కూసంపూడి మాధురి మహేష్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మాధురి మహేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించే విధంగా ప్రజలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనకుకారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ అధికారంలోకి వస్తే 3వ వార్డును అభివృద్ధిలో ముందుండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేశారు. ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో తొలి నామినేషన్ జనసేనదే

స్టేషన్ ఘనపూర్, జనవరి29(తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల్లో జనసేనపార్టీ అభ్యర్థులు నామినేషన్ దాఖాలు చేశారు. 18వ వార్డు నుండి రాజోజు సాయి చరణ్, 16వ వార్డు నుండి అంగిడి శ్రీనివాస్ లు పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ నేతృత్వంలో నామినేషన్ వేశారు. అనంతరం గాదె పృథ్వీ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో యువతను రాజకీయాల్లో తీసుకురావాలనే సంకల్పంతో యువతను పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.యువతతో మార్పు సాధ్యమైతుందని, అవినీతి రహిత పాలనకై జనసేన అభ్యర్థులను ఆదరించాలని కోరారు.రేపు ఇంకొన్ని వార్డులకు అభ్యర్థులు నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. జనసేనపార్టీ అభ్యర్థుల గెలుపుకై పార్టీ శ్రేణులు, సినీ ప్రముఖులు రానున్నట్లు తెలిపారు.వారి వెంట పార్టీ నాయకులు




మహమ్మద్ రజాక్, అక్కేనపల్లి సాయి, శెట్టి రాజేష్ తదితరులు ఉన్నారు.

# సజావుగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

**- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**
**- సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ కేంద్రంలో పరిశీలన**

రాజన్న సిరిసిల్ల, జనవరి 29 : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ముందుగా నామినేషన్ కేంద్రాల్లో ఓటర్ జాబితా, రిజర్వేషన్ జాబితా, నో డ్యూ సర్టిఫికెట్, హెల్ప్ డెస్క్, అభ్యర్థుల కోసం చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కులం ధృవీకరణ పత్రాల మంజూరులో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సిరిసిల్ల తహసీల్దార్‌కు ఆదేశించారు. ఈ నెల 30 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి 05.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని



స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. సిరిసిల్లలో 39 వార్డులకు సంబంధించి.. 13 మంది ఆర్ఓలు, 13 మంది ఏఆర్ఓలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నియమించామని తెలిపారు. ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీం లను నియమించామని విచారించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నూతన బ్యాంకు ఖాతా, అఫిడవిట్, బలపరిచే వారి వివరాలు, మిగతా పత్రాలు సమర్పించాలని సూచించారు. జనరల్ అభ్యర్థులకు ఎన్నికల డిపాజిట్ రూ. 2500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రూ. 1250 ఉందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కొండ బాల, మల్లి బాబు యాదవ్

ఇల్లందు, జనవరి 29 : ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు సోమ నాగేశ్వరరావు మాతృమూర్తి సోమ శేషమ్మ ఇటీవల వృద్ధాప్య కారణాలతో అనారోగ్యంతో మరణించింది. గురువారం జరిగిన శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి, జిల్లా అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# మామునూరు ఎయిర్‌పోర్ట్ కు భూమి అప్పగింత

**- చరిత్రలో నిలిచిపోయే రోజ అన్న డిప్యూటి సిఎం - ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను త్వరితగతన పూర్తి చేయాలి - బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

హైదరాబాద్, జనవరి 29 : పజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి గురువారం కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ ల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోక పోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ సిటీలు అయినా కొత్తగూడెం ఆదిలాబాద్ లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును రాష్ట్ర క్యాబినెట్ మొత్తం కోరగా వారు సానుకూలంగా స్పందించి




ముందుకు వెళ్లడం శుభసూచకం అని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సీఎం తెలిపారు.

# సినిమా న్యూస్




# అందాలతో బ్లాస్ట్ చేస్తున్న మౌని రాయ్..

అద్భుతమైన నటనతోనే కాదు వైమరిపించే అందాలతో ఆకట్టుకుంటున్న అది కొద్ది మంది హీరోయిన్స్ లో మౌని రాయ్ కూడా ఒకరు. హిందీ టెలివిజన్ సీరియల్స్ లో నటిస్తూ భారీ పాపులారిటీ సంపాదించుకున్న ఈమె.. నాగిన్ సీరియల్ తో మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. ఇదే సీరియల్ తెలుగులో నాగిని అంటూ విడుదల చేయగా.. ఇటు తెలుగు బుల్లితెర ఆడియన్స్ ని కూడా ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఒకవైపు సీరియల్స్ లోనే కాకుండా మరొకవైపు సినిమాలలో కూడా నటిస్తూ బిజీగా మారింది. 2006లో 'క్యూంకీ సాస్ భీ కభీ బహు థీ' అనే టెలివిజన్ షో తో నటన జీవితాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత పలు సీరియల్స్ లో నటించిన ఈమె ' హీరో హిట్లర్ ఇన్ లవ్' అనే పంజాబీ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసింది. 2018లో వచ్చిన గోల్డ్ చిత్రంతో హిందీ సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఇందులో ఉత్తమ నటన కనబరిచినందుకు గానూ ఉత్తమ మహిళ అరంగేట్రం కోసం ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ కూడా చేయబడింది మౌని రాయ్. అలాగే 2022లో బ్రహ్మాస్త్ర పార్ట్ 1 లో నటించి విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది.. ఇకపోతే ఈ చిత్రం ఉత్తమ సహాయక ఫిలింఫేర్ అవార్డుకు నామినేషన్ కూడా అందుకుంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూ బిజీగా మారిన ఈమె మరొకవైపు ఇటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ వరుస గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది.. తాజాగా వెకేషన్ కి వెళ్ళిన ఈమె.. అక్కడి అందాలను ఆరబోస్తూ అభిమానులలో చక్కిలిగింతలు పెడుతోంది. ముఖ్యంగా మౌని రాయ్ షేర్ చేసిన ఫోటోలు చూస్తుంటే అందాలతోనే బ్లాస్ట్ చేస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా తన ఫ్రెండుతో కలిసి దిగిన కొన్ని




వీడియోలను కూడా ఈమె తన ఇంస్టాగ్రామ్ ద్వారా పంచుకుంది. ప్రస్తుతం మౌని షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. మౌని రాయ్ వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే.. తరచూ దుబాయ్ వెళుతున్న నేపథ్యంలో యూఏఈ ఈమెకు గోల్డెన్ వీసా అందించింది. మూడు సంవత్సరాల రిలేషన్ తర్వాత గోవాలోని పనాజీలో దుబాయ్ కి చెందిన మలయాళీ వ్యాపారవేత్త సూరజ్ నంబియార్ తో 2022 జనవరి 27న ఏడడుగులు వేసింది. బెంగాలీ సాంప్రదాయం ప్రకారం ఒకసారి మలయాళీ సంప్రదాయం ప్రకారం మరోసారి అలా రెండుసార్లు వివాహం చేసుకుంది మౌని రాయ్. మౌని రాయ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం విశ్వంభర సినిమాలో నటించింది. ఈ సినిమా ఈ ఏడాది విడుదల కాబోతున్నట్లు ఇటీవల మెగాస్టార్ చిరంజీవి కూడా అధికారిక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అలాగే హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటిస్తోంది. అంతేకాదు మరో హిందీ చిత్రంలో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది.

# అందాల ఆండ్రియా తగ్గట్లేదుగా..!



తెలుగు ప్రేక్షకులకు తడాఖా సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ ఆండ్రియా. కేవలం నటిగా మాత్రమే కాకుండా ఈమె సింగర్‌గా ఇంకా పలు రకాల ట్యాలెంట్స్‌తో మల్టీ ట్యాలెంటెడ్ అనిపించుకుంది. పలు అవార్డ్‌లను రివార్డ్‌లను సొంతం చేసుకున్న ఆండ్రియా నటిగా ఇప్పటికీ బిజీగా ఉంది. ఈ ఏడాది ఈమె నటించిన మూడు నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. గత ఏడాదిలో ఈమె ఎక్కువగా కనిపించకున్నా ఈ ఏడాదిలో ఎక్కువగా కనిపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరో వైపు ఇటీవలే నాలుగు పదుల వయసులో పడ్డ ఆండ్రియా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను వరుసగా షేర్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆమె ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ కావడం తెలిసిందే. తాజాగా మరోసారి ఆండ్రియా అందాల ఆరబోత ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అందాల ఆరబోత ఫోటోలతో... ఆండ్రియా తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమె అభిమానులకు కన్నుల విందు చేస్తున్నాయి. బీచ్ లో సేద తీరుతు ఆండ్రియా ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చింది. సాధారణంగానే ముద్దుగుమ్మల ఫోటోలకు మంచి రీచ్ ఉంటుంది. ఇక బీచ్ ఫోటోలు అంటే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఆయా ఫోటోలు తెగ వైరల్ కావడం జరుగుతుంది. ఆండ్రియా బీచ్ ఫోటోలు సైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఆండ్రియా సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ విషయం నిజం అన్నట్లుగా ఆండ్రియా అందాల ఆరబోత ఫోటోలు సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతున్నాయి. ఆండ్రియా అందానికి ఫిదా అవుతున్న వారు చాలా మంది సోషల్ మీడియా ద్వారా కామెంట్ చేస్తూ ఫోటోలను తెగ షేర్ చేస్తు ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆండ్రియా... ఆండ్రియా నాలుగు పదుల వయసులోనూ ఇంత అందంగా ఉంది అంటూ ఫాలోవర్స్ మాట్లాడుకుంటున్నారు. సహజంగా అయితే వయసు పెరిగినా కొద్దీ అందం తగ్గుతూ ఉంటుంది. కానీ ఆండ్రియా అందం ఈ విషయంలో రివర్స్ లో పెరుగుతూ వస్తోందని అంటున్నారు. కెరీర్ ఆరంభంతో పోల్చితే ఆండ్రియా అందం ఇప్పుడు మరింత ఎక్కువ అయిందని నెటిజన్స్ అంటున్నారు. గతంతో పోల్చితే ఆండ్రియా ఇప్పుడు మరింత సన్నగా నాజూకుగా మారింది. అంతే కాకుండా స్టైలిష్ గా కూడా మారింది అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగానూ మంచి బిజీగా ఉన్న ఆండ్రియా మరో పదేళ్ల పాటు ఇదే జోష్ తో ఉంటుంది అంటూ ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఆండ్రియా ఈ మధ్య కాలంలో పాడటంను పక్కన పెట్టిందని, మళ్లీ పాడటం మొదలు పెట్టాలి అంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. సింగర్‌గా ఆండ్రియా జర్నీ... కన్నుమ్ కన్నుమ్ నోకియా పాటతో ఆండ్రియా సింగర్‌గా ఎంట్రీ ఇచ్చింది. హరిష్ జయరాజ్ ఈమెను సింగర్‌గా పరిచయం చేసింది. ఆండ్రియా ఎనిమిది ఏళ్ల వయసులో క్లాసికల్ పియానో నేర్చుకుంది. 10 ఏళ్ల వయసులోనే స్టేజ్ షో ఇవ్వడం ద్వారా ఆమె తన జర్నీని మొదలు పెట్టింది. థియేటర్ ఆర్టిస్ట్‌గా మంచి ప్రతిభ కనబర్చినప్పటికీ మొదట సింగర్‌గా ఈమెను గుర్తించారు. ఆ తర్వాత నటిగా ఈమె ఎంట్రీ ఇచ్చింది. ఆ మధ్య కాలంలో ప్రేమ వ్యవహారం కారణంగా వార్తల్లో నిలిచిన ఈమె మళ్లీ వ్యక్తిగత విషయాలతో కాకుండా సినిమాల వార్తలతో మీడియాలో నిలిచింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇప్పటికీ ఈమెకు మంచి ఆఫర్లు వస్తున్నాయంటే ఆమె ప్రతిభ కారణం అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అందం కంటిన్యూ అయితే మరో పదేళ్లు ఆండ్రియా ఇండస్ట్రీలో దూసుకు పోవడం ఖాయం అని కూడా కొందరు అంటున్నారు.

# 'కన్నప్ప' నెమలి అక్కడా షురూ !



చెన్నై బ్యూటీ ప్రీతీ ముకుందన్ టాలీవుడ్ లో 'కన్నప్ప' చిత్రంతో వెలుగులోకి వచ్చి నటి. పాన్ ఇండియాలో రిలీజ్ అయిన సినిమాలో అమ్మడు నెమలి అనే పాత్రలో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. కానీ ఫలించలేదు. అందం.. అభినయం గల నాయికే అయినా? 'కన్నప్ప' వైఫల్యంతో నెమలి పాత్రతో అనుకున్నంతగా రీచ్ అవ్వలేదు. ఆ తర్వాత మరే తెలుగు సినిమాలోనూ ఛాన్స్ రాలేదు. అయితే టాలీవుడ్ లో శ్రీవిష్ణు హీరోగా నటించిన 'ఓం బీమ్ భుష్' అనే చిత్రంతోనే లాంచ్ అయింది. కానీ ఈ సినిమా గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. 'కన్నప్ప' పాన్ ఇండియా రిలీజ్ కావడంతో తెలుగు జనాలకు రీచ్ అయింది. సక్సెస్ అయితే గుర్తింపు దక్కేది. అలాగే తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా అమ్మడు అదృష్టాన్ని పరీక్షించుకుంది. వాటి ఫలితాలు కూడా నిరాశనే మిగిల్చాయి. తాజాగా బాలీవుడ్ లో కూడా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ హీరోగా రెండు సినిమాలు తెరకెక్కుతున్నాయి. వాటిలో ఒకటి కబీర్ ఖాన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రముంది. అలాగే 'నాగ్ జిల్లా' అనే మరో చిత్రం ఉంది. ఈ రెండింటిలో ఒక సినిమాలో హీరోయిన్ గా ప్రీతి ముకుందన్ ఎంపిక చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీతీతో చిత్ర నిర్మాతలు చర్చలు జరుపుతున్నారు. అవి రెండు రోజుల్లో ఓ కొలిక్కి రానున్నాయి. అనంతరం అధికారికంగా వివరాలు వెల్లడించనున్నారు. అవకాశం వస్తే? అమ్మడు అదృష్టవంతురాలే. బాలీవుడ్ లో అవకాశాల కోసం ఎంతో మంది హీరోయిన్లు క్యూలో ఉన్నారు. చిన్న సినిమాలో ఛాన్స్ వచ్చినా? నటించాలని ఎదురు చూస్తున్నారు. అలాంటిది ప్రీతికి ఏకంగా కార్తీర్ ఆర్యన్ ప్రాజెక్ట్ లోనే ఛాన్స్ అందుకుంటుంది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్ కెరీర్ స్వింగ్ లో ఉంది. వరుస విజయాలతో దూసు కుపోతున్నాడు. అతడి సరసన నటించిన హీరోయిన్లకు మంచి గుర్తింపు దక్కింది.

# నితిన్ నుంచి మరో కథ చేజారిందా?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ పరిస్థితేమీ ఇప్పుడు బాలేదు. గత కొన్ని సినిమాలుగా నితిన్ వరుస ఫ్లాపుల్లోనే ఉన్నారు. ఎప్పటికప్పుడు ఈ సినిమా అయినా వర్కవుట్ అవుతుందని చేయడం, ఆ సినిమా అతన్ని, అతని ఫ్యాన్స్ ను నిరాశపరచడం.. ఇదే జరుగుతూ వస్తుంది తప్పించి నితిన్ కు హిట్ వచ్చి చాలా కాలమైంది. భీష్మ తర్వాత నితిన్ కెరీర్లో సరైన సక్సెస్ అనేది రాలేదు. అందుకే నితిన్ ఎలాంటి కథతో వచ్చినా దాన్ని యాక్సెప్ట్ చేయడానికి ఆడియన్స్ కూడా రెడీగా లేరు. వేణు శ్రీ రామ్ దర్శకత్వంలో వచ్చిన తమ్ముడు సినిమాకైతే కనీస ఓపెనింగ్స్ కూడా రాలేదు. దీంతో నితిన్ మార్కెట్ దారుణంగా పడిపోయింది. తమ్ముడు సినిమా తర్వాత రీసెంట్ గానే వి.ఐ ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రీసెంట్ గానే దాన్ని పట్టాలెక్కించారు నితిన్. వి.ఐ ఆనంద్ తో సినిమా చేస్తున్న నితిన్ వి.ఐ ఆనంద్ సినిమా తప్పించి నితిన్ చేతిలో ఇప్పుడు మరో ప్రాజెక్టు లేదు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in